క్లుప్తంగా

నమ్మకానికి ప్రతీక భారతి సిమెంట్



తాపీ మేస్త్రీలకు ఇన్సూరెన్స్ పత్రాలు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): నాణ్యతకు మారుపేరు, నమ్మకానికి ప్రతీక భారతి సిమెంట్ అని ఆ కంపెనీ టెక్నికల్ ఆఫీసర్ శివారెడ్డి, ఉదయ్‌కిరణ్ అన్నారు. మంగళవారం పట్టణంలో తాపీమేస్త్రీలకు ఇన్సూరెన్స్ పత్రాలు అందజేసి మాట్లాడారు. ట్యాంపర్ ప్రూఫ్ ప్యాకింగ్, జర్మన్ టెక్నాలజీతో భారతి సిమెంట్ తయారీ జరుగుతుందన్నారు. స్లాబ్ నిర్మాణానికి ఈ సిమెంట్ అన్ని విధాలా అనుకూలంగా ఉంటుందన్నారు. తర్వాత తాపీమేస్త్రీలు నిర్మాణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో భారతి సిమెంట్ కంపెనీ సిబ్బందితో పాటు డీలర్ సిద్దయ్య, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగికి సన్మానం



సన్మానం చేస్తున్న డాక్టర్లు

శిరివెళ్ల: ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ సుభాషిణి మంగళవారం పదవీ విరమణ చేశారు. ఈ మేరకు డాక్టర్లు ముఖేష్, ఆంజనేయులు, సీహెచ్‌ఓ రాంమోహన్‌రెడ్డి, సిబ్బంది ఆమెకు శాలువ కప్పి పూలమాలలతో సన్మానించారు. 30 ఏళ్లుగా వైద్య రంగంలో ఆమె చేసిన సేవలను కొనియాడారు.

2న తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న రంగనాయుడు

నంద్యాల(న్యూటౌన్): ఇళ్ల స్థలాల కోసం జూన్ 2వ తేదీన తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేస్తున్నట్లు సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇళ్ల స్థలాల కోసం జరిగే పోరుకు సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులందరూ ధర్నాకు తరలిరావాలన్నారు. ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, రైతు సంఘం కార్యదర్శి సోమన్న, సంజీవులు, సుశీలమ్మ, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ



శ్రీకాళికాంబదేవి

నంద్యాల(వ్యవసాయం): శ్రీకాళికాంబా చంద్రశేఖర స్వామి దేవస్థానంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే అమ్మవారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం 108 వెండి పుష్పాలతో అమ్మవారికి అష్టాదళ పాదపద్మారాధన సేవ కార్యక్రమం చేపట్టారు. అనంతరం మహామంగళ హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, వేదపండితులు రాఘవేంద్ర, మరణాచారి, ఆరవేటి వాసు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

ప్యాపిలి: మండల పరిధిలోని ఎస్ రాచర్ల గ్రామంలో జూన్ 1వ తేదీ న్యూ క్యాటగిరి విభాగంలో రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమత్సమేత సీతారామ లక్ష్మణ స్వాముల విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు వరుసగా రూ.80 వేలు, రూ.60 వేలు, రూ. 40 వేలు, రూ. 30 వేలు, రూ. 20 వేలు, రూ. 15వేలు, రూ. 10 వేలు చొప్పున అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు 95730 82338, 99086 14220 నంబర్లను సంప్రదించాలన్నారు.

కూర్మ జయంతి ఆహ్వానపత్రికల ఆవిష్కరణ

బేతంచెర్ల: ఆస్పరి మండలంలోని నల్లగుట్ట కూర్మ క్షేత్రంలో జూన్ 7న కూర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు విశ్వహిందూ పరిషత్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, సమరసత సేవా ఫౌండేషన్ డివిజన్ కన్వీనర్ నాగమోహన్ అన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యత

- గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలి
- యోగాంధ్రలో అందరూ భాగస్వాములు కావాలి
- అధికారులతో జిల్లా కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(న్యూటౌన్): పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, దీనిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ హాలులో గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్యం, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్, చెత్త సంపద తయారీ కేంద్రాలు తదితర అంశాలపై డీఆర్‌ఈఓ, డీఈఈ, ఏఈ, డిప్యూటీ ఎంపీడీఓలు, ఈఓఆర్‌డీలు, ఎంఆర్సీతో కలెక్టర్ సమీక్షించి మాట్లాడారు. గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం పేరుకుపోయిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. వానా కాలం ప్రారంభమైన నేపథ్యంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయాలన్నారు. జిల్లాలో 24 పర్యాటక కేంద్రాలున్నాయని వాటి పరిసర ప్రాంతాల్లో చెత్తా చెదారం ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి గ్రామాల్లో ట్యాంకులను శుభ్రం చేసి తదుపరి పరిశుభ్రం చేయాల్సిన తేదీని కూడా ట్యాంకుపై రాయాలన్నారు. నీటిని ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు ముందు జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో నీటి పరీక్ష కిట్లు తప్పనిసరిగా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. జిల్లాలో వ్యక్తిగత మరుగుదొడ్లు 1971 మంజూరు చేశామని, అందులో ఇంకా 930 పెండింగ్‌లో ఉన్నాయని వాటి నిర్మాణాలు త్వరగా పూర్తి అయ్యేలా చూడాలన్నారు. కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌కు సంబంధించి కొత్తగా బీసీ వసతి గృహాలకు 27, సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు 28, ఇతర పర్యాటక ప్రాంతాల్లో 8 మంజూరు చేశామన్నారు. ఈ పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. క్లాప్ మిత్రాలు తెస్తున్న తడి, పొడి చెత్త వివరాలను సక్రమంగా రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. జూన్ నెలలో నీరు–మీరు కార్యక్రమం నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. యోగాంధ్రలో భాగంగా జూన్ 16వ తేదీన జరిగే కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులందరూ పాల్గొనేలా చూడాలన్నారు.

రూల్‌ఆఫ్ రిజర్వేషన్ పారదర్శకంగా అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

నంద్యాల(న్యూటౌన్): రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతూ పదోన్నతుల్లో ఎస్టీ ఉపాధ్యాయులకు రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పారదర్శకంగా అమలు చేయాలని షెడ్యూల్డ్ ట్రైబ్ టీచర్స్ ఫెడరేషన్ (ఎస్‌టీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోళ్ల సుధాకర్, కాలంగిరి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతుల కోసం విడుదల చేసిన సబ్జెక్టుల సీనియారిటీ జాబితాలో ఒక్క ఎస్టీ ఉపాధ్యాయుడి పేరు కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నెం.5 ప్రకారం అన్ని కేడర్లలో రిజర్వేషన్ వర్తింప జేసి ఎస్టీలకు ప్రాతినిధ్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధరణి ఉపేంద్ర మాట్లాడుతూ ఉపాధ్యాయుల పదోన్నతుల్లో జిల్లాలో అన్ని కేడర్ల వారీగా ఎంత మంది ఉన్నారో తెలియజేయాలన్నారు. సమావేశంలో ఎస్‌టీటీఎఫ్ నాయకులు మత్యనాయక్, కేషాలు నాయక్, రామకృష్ణ, నాగరాజు, రాము, తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల జాబితాలో ఎస్టీ అభ్యర్థులను చేర్చాలి

నంద్యాల(న్యూటౌన్): పాఠశాల సహాయకులు బయాలజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్, సోషల్ సబ్జెక్టు పదోన్నతుల జాబితాలో ఎస్టీ అభ్యర్థులను చేర్చాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న, ప్రధాన కార్యదర్శి లక్ష్మణనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2003 జీఓనం 5 ప్రకారం 5 కంటే ఎక్కువ పోస్టులుంటే పదోన్నతుల్లో రిజర్వేషన్ అమలు చేయాలన్నారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

ఉయ్యాలవాడ : 50 శాతం సబ్సిడీతో మండలానికి 10 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు మంజూరయినట్లు మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సబ్సిడీపోను కేజీ రూ. 61.50 రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రతి రైతుకు 20 కేజీల జీలుగ విత్తనాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. విత్తనాలు కావాల్సిన వారు ఆయా రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

సూక్ష్మ ప్రణాళికకు 279 గ్రూపులు

ఉయ్యాలవాడ : సూక్ష్మ ప్రణాళిక కింద మండలంలో 279 పొదుపు లక్ష్మి గ్రూపులు 2025–26 ఆర్థిక సంవత్సరానికి అర్హత సాధించినట్లు ఆ శాఖ ఏపీఎం దాస్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 540 పొదుపు లక్ష్మి గ్రూపులు ఉన్నాయన్నారు. అర్హత సాధించిన గ్రూపుల్లో బయోమెట్రిక్ వేసిన సభ్యులకు మాత్రమే రుణ సౌకర్యం పొందేందుకు అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు.

నేడు యోగాసనాలు

నంద్యాల(అర్బన్): యోగాంధ్ర ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మండల స్థాయి అధికారులతో యోగాసనాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుగుణశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశాల మేరకు అధికారులందరూ ఈ కార్యక్రమానికి హాజరుకావాలన్నారు.

అధ్యాపకులకు పారితోషికం పెంచాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పని చేస్తున్న అతిథి అధ్యాపకులకు పారితోషికం మరింత పెంచాలని అతిథి అధ్యాపకుల సంఘం నాయకులు సుధాకర్, శ్రీనివాసులు, లక్ష్మణస్వామి కోరారు. మంగళవారం డీఐఈఓ సునీతను మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు.

శనగల బసవన్నకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలో శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైలక్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలువీరభద్ర స్వామికి మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రదోషకాల సమయంలో క్షేత్రపాలకుడు వీరభద్రునికి, నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలను నిర్వహించారు. ఆరంభ పూజల్లో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు. నందీశ్వర స్వామికి నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను, క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.

కుమారస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమార స్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేషక్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

మండలస్థాయిలో దూదేకుల కమిటీలు



సమావేశంలో దూదేకుల సంఘం నాయకులు

నంద్యాల(వ్యవసాయం): జిల్లాలోని ప్రతి మండలంలో దూదేకుల కమిటీలు ఏర్పాటు చేయాలని దూదేకుల రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బాబన్ పేర్కొన్నారు. స్థానిక వాసవీ స్కూల్‌లో మంగళవారం నూర్‌బాషా దూదేకుల నంద్యాల జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో దూదేకుల సంఘం బలోపేతం కావాలంటే అన్ని మండలాల్లో కమిటీలు ఏర్పాటు కావాలన్నారు. దూదేకుల కులస్తులలో పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పారితోషికం అందించి ప్రోత్సహించాలన్నారు. పట్టణ కమిటీ అధ్యక్షుడు షేక్షావలి మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు తన వంతుగా 15 మందికి పారితోషికం అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు దస్తగిరి, హుస్సేనప్ప, వసుమతి, పర్ల దస్తగిరి, సోమశేఖర్, గబ్బర్ దస్తగిరి ఇబ్రహీం, రెహమాన్, కాశీం, బాబు, చాగలమర్రి బ్రహ్మయ్య, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులు శాంతి సమాధానాలతో ముందుకెళ్లాలి



సమావేశంలో పాల్గొన్న క్రైస్తవ సంఘాల ప్రతినిధులు

నంద్యాల(న్యూటౌన్): ప్రపంచ శాంతి కోసం క్రైస్తవులు శాంతి సమాధానంతో ముందుకెళ్లాలని ఆసియా దేశాల ప్రతినిధులు బ్రదర్ ధర్మవీర్‌పాల్, డాక్టర్ స్పిర్మా, బందెల రాజు, ఏసుకృపా మినిస్ట్రీస్ దైవ సేవకులు అందనం ఏసన్న సూచించారు. మంగళవారం పట్టణంలోని జేకే ఫంక్షన్ హాల్‌లో దైవ సేవకుల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా హాజరైన ఆసియా దేశాల ప్రతినిధులు మాట్లాడుతూ దైవ సేవకులు ఏసు సేవలో ఎలా జీవించాలి, ఎలా నడుచుకోవాలి తదితర విషయాలపై సదస్సులో చర్చించారు. ప్రపంచ శాంతి కోసం క్రైస్తవ మతపెద్దలు, సంఘాలు, సమిష్టి నిర్ణయంతో ప్రార్థనలు చేయాలన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు దేవప్రియం, పాస్టర్ బెన్ని, సునీల్, ఏసన్న, సురేష్, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతులను దగా చేస్తున్న కంపెనీలు



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

ఆళ్లగడ్డ: పొగాకు కంపెనీలు రైతులను దగా చేస్తున్నాయని, వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రుడు డిమాండ్ చేశారు. మంగళవారం మిట్టపల్లె, మర్రిపల్లె, నరసాపురం, తిప్పారెడ్డిపల్లె తదితర గ్రామాల్లో పొగాకు రైతులతో కలిసి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పొగాకు కంపెనీలతో మాట్లాడి పంట సాగుకు ముందు వారు రైతులతో చేసుకున్న ఒప్పందం ప్రకారం ధర అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒప్పంద పత్రాల్లో పొందు పరిచిన విధంగా క్వింటాల్ రూ. 18 వేలు ధర కల్పించకపోవడంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒప్పందాల అమలులో అన్యాయం జరిగితే తాము చేపట్టే అందోళనకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

హైవే నిర్మాణంపై సీబీఐతో విచారణ చేపట్టాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న లబ్బి వెంకటస్వామి, తదితరులు

పాములపాడు: నేషనల్ హైవే 340సీ రహదారి నిర్మాణంలో నాణ్యత లోపించిందని, సీబీఐతో విచారణ చేయించాలని మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్మాణం జరుగుతున్న హైవే, అండర్‌పాస్ వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాములపాడు, కొత్తపల్లి మండలాల్లో సుమారు 40 గ్రామాలకు సర్వీసు రోడ్డు నిర్మించకుండా నేషనల్ హైవే అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. నిర్మాణంలో దృఢమైన కంకర వినియోగించాల్సి ఉండగా ఎస్‌ఆర్‌ఎంసీ కాలువ ఎర్ర రాయిని కంకరగా చేసి నిర్మాణంలో వాడారని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ సుభద్రమ్మకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో చెలిమిల్ల సర్పంచు కోట్ల చంద్రారెడ్డి, ఎంపీటీసీ సురేష్, లింగాల సర్పంచు మల్లీశ్వరరెడ్డి, నీటిసంఘం జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు కోట్ల నాగేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగరాజు పాల్గొన్నారు.

బది'లీల'లెన్నో?

- కొత్తగా పుట్టుకొస్తున్న ఆఫీసు బేరర్లు
- గతంలోనే కో–ఆప్షన్ చేసుకున్నట్లుగా అడ్డుగోలుగా లేఖలు
- ముడుపులతో జేబులు నింపుకుంటున్న నేతలు

కర్నూలు(అగ్రికల్చర్): బదిలీలపై నిషేధం ఎత్తివేశారంటే గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాలకు పండగే. బదిలీల నుంచి తప్పించుకొని పనిచేసే చోటనే కొనసాగేందుకు ఉద్యోగ సంఘాల్లో ఆఫీసు బేరర్లుగా ఉన్నట్లుగా లేఖలు పుట్టుకొస్తున్నాయి. రెండేళ్ల క్రితమే కో–ఆప్షన్ చేసుకున్నామంటూ దర్జాగా లేఖలు ఇస్తూ జేబులు నింపుకుంటున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ సంఘం నాయకులు అడ్డగోలుగా ఆఫీసు బేరర్లు అంటూ లేఖలు ఇస్తుండటం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లా, తాలూకా స్థాయిలో ఆఫీసు బేరర్లుగా అప్పటికప్పుడు లేఖలు తెచ్చుకొని బదిలీల నుంచి తప్పించుకుంటున్నారు. గుర్తింపు పొందిన సంఘాల్లోని ఆఫీసు బేరర్లకు తొమ్మిదేళ్ల వరకు బదిలీలు లేవు. కొంతమంది తొమ్మిదేళ్లు గడచిపోయినప్పటికీ పనిచేసే చోటనే కొనసాగేందుకు మార్గాలను అన్వేషించుకుంటున్నారు. వ్యవసాయ శాఖలో ఇద్దరికి ఆఫీసు బేరర్లుగా లెటర్లు ఇవ్వడం చర్చనీయాంశం అయ్యింది. సంఘంలో కనీసం ఓటర్లు కాని వారు కూడా ఆఫీసు బేరర్లుగా మారిపోయారు. ముడుపులు పుచ్చుకొని ఆర్ అండ్ బీలో ఒకరికి, పే అండ్ అకౌంట్స్ కార్యాలయంలో ఇద్దరికి ఆఫీసు బేరర్లంటూ లేఖలు ఇచ్చినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ నేతలు కూడా జిల్లా, తాలుకా యూనిట్‌లలో ఆఫీసు బేరర్లంటూ పలువురికి లేఖలు ఇచ్చినట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. ఏపీ ఎన్జీఓ అసోషియేషన్ నేతలు జిల్లా, తాలూకా ఆఫీసు బేరర్లంటూ కలెక్టర్‌కు లేఖలు ఇచ్చారు. కలెక్టర్ వీటిని ఆమోదించకుండా మరిన్ని వివరాలు కోరడం చర్చనీయాంశం అయ్యింది. జిల్లా సంఘం నుంచి నలుగురిని సస్పెండ్ చేశారు. వీరు రాష్ట్ర సంఘానికి అప్పీల్ చేసుకుంటే కొనసాగేందుకు అవకాశం లభించింది. జిల్లా ఆఫీసు బేరర్ల పేర్లలో వీరి పేర్లను చేర్చలేదు. దీంతో రాష్ట్ర సంఘం నుంచి ప్రొసీడింగ్స్ తెచ్చుకున్న నాయుకులు తాము కూడా అసోసియేషన్‌లో ఉన్నామని కలెక్టర్‌కు విన్నవించుకోవాల్సి వచ్చింది. ఆఫీసు బేరర్లుగా తొమ్మిదేళ్లు గడచిన వారిని బదిలీ చేయాలని ఈ నేతలు డిమాండ్ చేస్తుండటం గమనార్హం.

సత్ప్రవర్తనతో మెలగాలి



ఉప కారాగారంలో తనిఖీ నిర్వహిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శేషాద్రి

ఆళ్లగడ్డ: క్షణికావేశంలో నేరాలకు పాల్పడి ప్రస్తుతం జైలులో ఉన్న ఖైదీలు బయటకు వెళ్లిన తర్వాత సత్ప్రవర్తనతో మెలగాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ లీలా వెంకట శేషాద్రి అన్నారు. స్థానిక ఉప కారాగారంలోని న్యాయ సహాయ కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కారాగారంలో ఉన్న ఖైదీలతో ఏఏ కేసుల్లో నిందితులుగా ఉన్నారు. ఎప్పటి నుంచి రిమాండ్‌లో ఉంటున్నారు అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదులు ఉన్నారా అని ఆరా తీశారు. అలాగే జైలులో కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేని రిమాండ్ ఖైదీలు దరఖాస్తు చేసుకుంటే ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైన అర్హత ఉన్న ఖైదీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపకారాగారాధి సెల్వంత్ ఉన్నారు

- నంద్యాల(వ్యవసాయం): ఉమ్మడి కర్నూలు జిల్లా న్యాయ సేవా కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి మంగళవారం స్పెషల్ సబ్‌జైల్‌ను తనిఖీచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 70 ఏళ్లు పైబడిన వృద్ధ ఖైదీలకు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. హెల్ప్‌లైన్ నంబర్ 15100 పై ఖైదీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ గురు ప్రసాద్ రెడ్డి, డాక్టర్ గురుకుమార్ న్యాయవాదులు బాలు నాయక్, శేష సాయిబాబా, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు యోగాసనాలు



రుద్రవరంలో యోగాసనాలు వేస్తున్న వివిధ శాఖల ఉద్యోగులు



ఉయ్యాలవాడ మోడల్‌స్కూల్‌లో యోగాపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రుద్రవరం: ప్రజల ఆరోగ్య పరిరక్షణకై యోగాసనాలు చేయిస్తున్నట్లు జిల్లా యోగా శిక్షణ అధికారిణి నీరజ తెలిపారు. మండల కేంద్రం రుద్రవరంలోని మండ పరిషత్ సమావేశ భవనంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం ఆమె వివిధ శాఖల ఉద్యోగులతో యోగాసనాలు వేయించారు. ఈ నెల31 వరకు యోగా శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భాగ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

- శిరివెళ్ల: యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప అన్నారు. యోగాంధ్రపై మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ, సచివాలయాల సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యోగాపై ఆసక్తి ఉన్న వారి వివరాలు సేకరిస్తున్నట్లు చెప్పారు. మండలంలో కనీసం 1500 మందికి యోగా నేర్పాలన్నది లక్ష్యమన్నారు. జూన్‌లో శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు.

యోగాతో ఆరోగ్యం

ఉయ్యాలవాడ : ప్రతి రోజు ఉదయం యోగా చేస్తే ఆరోగ్యంగా ఉండొచ్చని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక మోడల్ స్కూల్‌లో మండల పరిధిలోని వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులందరికీ యోగాయాప్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 7,200 మందికి యోగా శిక్షణ ఇచ్చేందుకు ప్రతి గ్రామ సచివాలయం నుంచి 9 మంద ఉద్యోగులకు మాస్టర్ ట్రైనర్ల శిక్షణ ఇచ్చేలా ప్రణాళిక రూపొందించామన్నారు. తర్వాత మోడల్‌స్కూల్‌లో ఉద్యోగులతో కలిసి యోగాసనాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్లు నిర్మల, శివప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధం



వక్ఫ్ సవరణ చట్టంపై అవగాహన కల్పిస్తున్న నాయకులు

నంద్యాల (వ్యవసాయం): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని ఎస్‌డీపీఐ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్లా ఖాన్ అన్నారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయం నందు మంగళవారం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజాస్ హుస్సేన్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలకు వక్ఫ్ సవరణ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టం వల్ల ముస్లిం మైనార్టీల హక్కులకు భంగం వాటిల్లుతుందన్నారు. ఆస్తులకు రక్షణ లేకుండా పోతుందన్నారు. ఈ విషయాన్ని కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు హుసేన్ పీరా, మజీద్ ఖాన్ పాల్గొన్నారు.

రైలు ప్రయాణికుల పాట్లు

- కిక్కిరిస్తున్న నంద్యాల–రేణిగుంట రైలు
- అదనపు బోగీల కోసం ఎదురుచూపు



నంద్యాల నుంచి రేణిగుంట డెమో రైలు

బనగానపల్లె: నంద్యాల నుంచి రేణిగుంటకు వెళ్లే డెమో రైలుకు అదనపు బోగీలు ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రయాణికులు కోరుతున్నారు. తిరుమల వెంకన్న స్వామి దర్శనం కోసం వెళ్లే ప్రయాణికులకు ఈ రైలు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఏడు బోగీలతో ప్రతి రోజు ఉదయం 6 గంటలకు నంద్యాల నుంచి బయల్దేరి రేణిగుంటకు మధ్యాహ్నం 12.45కు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 1.30 గంటలకు బయలుదేరి రాత్రి 8 గంటలకు నంద్యాలకు చేరుకుంటుంది. ఈ రైలు నంద్యాల నుంచి మద్దూరు, బనగానపల్లె, కోవెలకుంట్ల, సంజామల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, కడప, రాజంపేటతో పాటు ప్రతి చిన్న రైల్వేస్టేషన్‌లోనూ ఆగుతూ ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుంది. 2016 ఆగస్టులో డెమో రైలు ప్రయాణ సౌకర్యాన్ని నంద్యాల నుంచి కడప వరకు అధికారులు కల్పించారు. ఆ తరువాత కడప సమీపంలోని పెండ్లిమర్రి వరకు పొడిగించారు. కొంత కాలం తర్వాత రేణిగుంట వరకు పొడిగించారు. ఆర్టీసీ బస్సు టికెట్ కన్నా డెమో రైలులో టికెట్ చాలా తక్కువగా ఉండి తక్కువ సమయంలోనే రేణిగుంట చేరుతున్నందున రైలు ప్రయాణానికే ప్రయాణికులు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. నంద్యాల నుంచి రేణిగుంటకు టిక్కెట్ రూ.60 ఉండగా బస్సులో రూ.500 ఉంది. ముఖ్యంగా నంద్యాల నుంచి రాజంపేట వరకు ఇంటర్, బీటెక్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రతి రైల్వేస్టేషన్ నుంచి 70–80 మంది ప్రయాణికులు ఈ రైల్‌లో ప్రయాణిస్తున్నారు. కొంత కాలంగా నంద్యాల ప్రారంభంలోనే ప్రయాణికులతో ఈ రైల్ కిక్కిరిసి ఉంటుంది. నంద్యాల నుంచి ప్రొద్దుటూరు వరకు అన్ని విధాలుగా పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో పారిశ్రామికవేత్తలకు కూడా ఈ ప్రయాణం ఎంతో అవసరంగా ఉంది. ప్రస్తుతం ఉన్న బోగీలు చాలకపోవడంతో ప్రయాణికులు నిలబడి ప్రయాణించాల్సిన పరిస్థితి. రైల్వే ఉన్నతాధికారులు సమస్యను గుర్తించి అదనపు బోగీలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఉపకార వేతనాలు మంజూరు

నంద్యాల(అర్బన్): డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, మెడికల్ కోర్సులు చదువుతున్న ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థినీ విద్యార్థులకు 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి కళాశాలలకు ఉపకార వేతనాలు మంజూరు అయినట్లు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఇన్‌చార్జి అధికారి అబ్దుల్‌జలీల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 01-03-2024 వరకు మొదటి విడత కింద ఫీజును విడుదల చేశారన్నారు.

కుందూకు జలకళ



కుందూనదిలో పారుతున్న వర్షపునీరు

దొర్నిపాడు: గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు క్రిష్టిపాడు సమీపంలోని కుందూనదిలో జలకళ ఉట్టిపడుతోంది. ఇన్నాళ్లుగా అడుగంటిన కుందులో ప్రస్తుతం వర్షపు నీరు ప్రవహిస్తుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 16.6 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ సుభద్ర మంగళవారం తెలిపారు. మిట్టమిద్దెల్లో నివస్తున్న వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.